www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 30 నవంబర్ 2023

ఎల్ఐసి జీవన్ ఉత్సవ్ పాలసీ ప్రారంభం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జీవిత బీమా సంస్థ సరికొత్త జీవన్ ఉత్సవ్ పాలసీని సంస్థ డివిజనల్ కార్యాలయంలో సీనియర్ డివిజన్ మేనేజర్ బి.ప్రసాదరావు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాలసీ నాన్ లింక్డ్, నాన్ పార్టిసిపేటింగ్ వ్యక్తిగత సేవింగ్స్ హోల్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్, నిర్ధేశిత కాలవ్యవధికి సంబంధించిన పూర్తి జీవిత కాలంలో ఖచ్చితమైన రాబడి పొందే అవకాశం ఉందని తెలిపారు. ప్రీమియం చెల్లించే కాల పరిమితిలో ప్రతి రూ.వెయ్యి బీమా మొత్తానికి రూ.40 గ్యారంటీ ఎడిషన్స్ ఆఫర్ ఉటుందని,పాలసీదారుడు రెగ్యులర్ ఆదాయ సదుపాయం లేదా ఫ్లెక్సీ ఆదాయ ప్రయోజనం పొందవచ్చునని తెలిపారు. రెగ్యులర్ ఆదాయ సదుపాయంలో పాలసీదారునికి ప్రతి బీమా మొత్తంలో 10 శాతం పొందే అవకాశం ఉందన్నారు.

ప్రజా పంపిణీపై మరింత నిఘా

- ఇక విజిలెన్స్ కమిటీలు
- సర్పంచులు, కౌన్సిలర్లతో పర్యవేక్షణ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రజా పంపిణీ వ్యవస్థపై మరింత నిఘా పెరగనుంది. పేదలకు అందజేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్న విషయం విదితమే. దళారులు ప్రజల నుంచి కొనుగోలు చేసిన బియ్యానికి ఇతర దేశాలకు ఎగుమతులు చేయడం, రీ పాలిష్ చేయడం పరిపాటిగా మారింది. తాజాగా బియ్యం ధరలు పెరగడంతో దళారులు రేషన్ బియ్యం కోసం ఎగబడుతున్నారు. ఈ నేపథ్యంలో కార్డుదారులకు సరుకుల పంపిణీలో పారదర్శకత పెంచేందుకు ప్రభుత్వం మరింత కట్టుదిట్టమైన చర్యలకు దిగింది. ఈ నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ సమాయత్తమైంది. క్షేత్రస్థాయిలో రేషన్ దుకాణాల వారీగా గతంలో ఉన్న ఆహార సలహా కమిటీల స్థానంలో విజిలెన్స్ కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.

జిల్లాలో 870 రేషన్‌షాపుల పరిధిలో మొత్తం 5.73 లక్షల బియ్యం కార్డులున్నాయి. సుమారు 360 ఎండియు వాహనాల ద్వారా కార్డుదారులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నారు. పౌర సరఫరాల శాఖలో జవాబుదారీతనం, సరుకుల పంపిణీలో తలెత్తే ఇబ్బందులు తదితర అంశాలపై పర్యవేక్షణకు గతంలో మండల, డివిజన్, జిల్లాస్థాయిలో ఆహార సలహా కమిటీలు ఉండేవి. ప్రస్తుతం వాటి స్థానంలో ప్రభుత్వం విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేస్తోంది.

15 మంది సభ్యులతో విజిలెన్స్ కమిటీ

మండల, డివిజన్, జిల్లాస్థాయిలో కమిటీలతోపాటు ప్రతి రేషన్ డిపోకూ ఒక కమిటీని నియమిస్తున్నారు. మున్సిపాల్టీలో అయితే కౌన్సిలర్, గ్రామీణ ప్రాంతాల్లో సర్పంచ్ అధ్యక్షతన ఏర్పాటు చేసే విజిలెన్స్ కమిటీకి సంబంధిత విఆర్ఒ కార్యదర్శిగా వ్యవహరిస్తారు. మొత్తం 15 మంది సభ్యులతో కూడిన కమిటీలో ఇద్దరు డ్వాక్రా గ్రూపు సభ్యులు, ఇద్దరు సామాజిక కార్యకర్తలు, ఐదురుగు కార్డుదారులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, పౌరసరఫరాల డిటి లేదా ఇన్‌స్పెక్టర్, దివ్యాంగుల నుంచి ఒకరు, సహాయ సాంఘిక సంక్షేమశాఖాధికారి, ఎండియు ఆపరేటర్, ఆ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం ఉంటారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్‌డిఒ, మండల స్థాయిలో తహశీల్దార్ చైర్మన్లగా వ్యవహరిస్తారు. కమిటీ సభ్యులు మూడు నెలలకొకసారి సమావేశమవుతారు. డిపో పరిధిలో కార్డుదారులకు క్షేత్రస్థాయిలో సరుకులు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా..? లేదా? అనే అంశాలపై చర్చిస్తారు. మండల కమిటీ నిర్వాహకులు మండలంలోని దుకాణాలు, ఎండియు ఆపరేటర్ల మధ్య సమన్వయంపై ఎప్పటికప్పుడు చర్చించనున్నారు.

అక్రమాలకు అడ్డుకట్ట ఏదీ..?

జిల్లాలో ప్రతి రెండువారాలకు ఒకసారి భారీగా రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకుంటున్నా అక్రమార్కులకు అడ్డుకట్ట పడటం లేదు. కాకినాడ కేంద్రంగా ఉచిత బియ్యాన్ని అక్రమమార్గంలో మిల్లర్లకు తరలిస్తున్నారని, వాటిని పాలిష్ చేసి మళ్లీ బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీన్ని అరికట్టడానికి ప్రజాప్రతినిధులతో నిఘా కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. రేషన్ సరుకుల పంపిణీ తీరు, డిపోల సమయపాలన, తూకాల్లో మోసాలను అరికట్టడం, సరుకుల అక్రమ రవాణాను అడ్డుకోవడం కమిటీల బాధ్యతలుగా నిర్దేశించారు. ప్రజాప్రతినిధుల జోక్యం మొదలైతే పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. సరుకుల పంపిణీలో అక్రమాలు జరగుకుండా కమిటీలకు అవగాహన కల్పించడమే కీలకం.

పరిశ్రమల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు అధికారులు అందుబాటులో ఉంటారని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. తాడేపల్లి నుంచి ఎమ్ఎస్ఇ-సిడిపి నిధులతో రూ.20.64 కోట్ల అంచనా విలువతో కలవచర్లలో చేపట్టనున్న నూతన పారిశ్రామికవాడకు ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి వర్చువల్‌గా బుధవారం శంఖుస్థాపన చేశారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ఎంఎల్ఎలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు ఇతర ప్రజా ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి పరిశ్రమల ఏర్పాటు, వాటికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఉద్దేశించిన కార్యాచరణ ప్రణాళికలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లాల్లో పారిశ్రామిక అభివృద్ధి క్లస్టర్ల ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఏపి ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (APIIC) లిమిటెడ్ కోసం రూ.2,065 లక్షల అంచనాతో మంజూరైన ఫుడ్ ప్రాసెసింగ్ పారిశ్రామిక అభివృద్ధి ప్రాజెక్ట్ కలవచర్లలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

వర్చువల్ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎంఎల్ఎలు

సమగ్ర ప్రాజెక్ట్ నివేదికను సంబంధిత అంచనా వ్యయంతో ప్రధాన కార్యాలయానికి సమర్పించినట్టు చెప్పారు. ఎంఎస్ఇ- సిడిపి కేంద్ర ప్రభుత్వ గ్రాంట్ రూ.1050 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం/ ఎపిఐఐసి గ్రాంట్ రూ.1,015 లక్షలతో ఈ ప్రాజెక్ట్ ప్రతిపాదించినట్టు చెప్పారు. అంతర్గత రహదారులు, మురుగునీరు పారుదల వ్యవస్థ, ముందస్తు నిర్వహణ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రాజానగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా మాట్లాడుతూ సిఎం వైఎస్.జగన్ నేతత్వంలో నాలుగున్నరేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి, అవినీతి రహిత పాలన దిశగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా అనేక రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్రాభివద్ధి కోసం పారిశ్రామిక ప్రగతి లక్ష్యంగా సంబంధిత పరిశ్రమలు ఏర్పాటు చేసే ఔత్సాహితులను ప్రోత్సహిస్తూ ముందుకెళ్తున్నారన్నారు. కలవచర్లలో 104 ఎకరాలు విస్తీర్ణంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏర్పాటుకు నిధులు సమకూర్చడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా నేడు సిఎం శంకుస్థాపన చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, ఎంపిపి ఎం.వీర్రాజు, జిల్లా పరిశ్రమల అధికారి బి.వేంకటేశ్వర రావు, ఎపిఐఐసి డిప్యూటీ జోనల్ మేనేజర్లు డివిఎస్ఎన్ జ్యోత్స్నాదేవి, బి.రాధామణి, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్‌లు శిక్షణా కేంద్రాలుగా ఉపయోగపడుతున్నాయని అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక దానవాయిపేట మున్సిపల్ హైస్కూల్ కాంప్లెక్స్‌లో ప్రాథమిక పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను బుధవారం ఆయన పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో ఎప్పటికప్పుడు తీసుకొస్తున్న మార్పులను కాంప్లెక్స్ సమావేశాల్లో చర్చిస్తామన్నారు. ఆ అంశాలను ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు అవగాహన చేసుకుని పాఠశాల స్థాయిలో వినియోగించాలని కోరారు. షెడ్యూల్ ప్రకారం కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. హెచ్ఎంలు పాఠశాలలో నిర్వహించాల్సిన కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం ఎప్పటికప్పుడు నిర్వహించాలని ఆదేశించారు. కార్యాలయానికి అందజేయవలసిన వివరాలను సమయానికి అందజేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో పాఠశాలకు అందజేసిన గుడ్లు, చిక్కీల వివరాలను ఐఎంఎంఎస్ యాప్‌లో విధిగా నమోదు చేయాలన్నారు. కాంప్లెక్స్ సమావేశాలకు హాజరైన ఉపాధ్యాయుల వివరాలు ఇచ్చిన గూగుల్ ఫామ్‌లో కార్యాలయానికి సబ్‌మిట్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్పర్సన్ ఎన్.రాజా ప్రశాంత్, కార్యదర్శి పరస జగన్నాథ రావు, సిఆర్‌పి జయంతి శాస్త్రి, కోటేశ్వరి, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు 33 మంది హాజరయ్యారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఐ దిలీప్ కుమార్

'ఆడుదాం ఆంధ్ర'కు రిజిస్ట్రేషన్

రాజమహేంద్రవరం రూరల్ : ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో పాల్గొనే 15 ఏళ్ల పైబడిన యువతీ యువకులు రిజిస్ట్రేషన్ చేయించుకోనవచ్చునని రూరల్ మండలం ప్రత్యేకాధికారి ఎన్.జ్యోతి అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్ లోగో, పోస్టర్‌ను ఆడుదాం ఆంధ్రా మండల కమిటీ చైర్మెన్, ఎంపిడిఒ డి.శ్రీనివాసరావు అధ్యక్షతన ఆవిష్కరించారు. మండల ప్రత్యేకాధికారి ఎస్.జ్యోతి మాటాడుతూ వివరించారు.

నన్నయలో 'సంపూర్ణత ద్వారా శ్రేష్టత'పై సెమినార్

సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ జితేంద్రమోహన్

ప్రజాశక్తి-రాజానగరం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సొసైటీ ఫర్ కమ్యూనిటీ రీసెర్చ్ అండ్ యాక్షన్, విశ్వవిద్యాలయ స్పృహ సైకాలజీ అలుమ్ని అసోసియేషన్, సైకాలజీ విభాగం, రోటరీ, జిఎస్ఎల్ సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల 'సంపూర్ణత ద్వారా శ్రేష్టత'పై అంతర్జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమయ్యింది. నన్నయ విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల అధ్యక్షతన నిర్వహిస్తున్న ఈ సెమినార్‌లో ముఖ్యఅతిథిగా స్పోర్ట్స్ సైకాలజిస్ట్, పంజాబ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జితేంద్రమోహన్ కీలకోపన్యాసం చేశారు. హైదరాబాద్ అపోలో హాస్పిటల్ డాక్టర్ చెన్నంశెట్టి విజయకుమార్ 'నిద్ర సమస్యలు ఆరోగ్యం' అనే అంశంపై ఉపన్యసించారు. విశ్వవిద్యాలయ విసి కె.పద్మరాజు మాట్లాడుతూ నిత్యజీవితంలో సైకాలజీ చాలా కీలకమైన అంశమన్నారు. అందరూ దాన్ని అధ్యయనం చేస్తూ మానసిక ప్రశాంతత వైపుకు వెళ్లాలని అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. 235 మంది డెలిగేట్స్ వివిధ సంస్థలు, కళాశాలల నుంచి పాల్గొన్నారు. సదస్సు డైరెక్టర్ ప్రముఖ మానసిక వైద్య నిపుణులు కర్రి రామారెడ్డి, సదస్సు నిర్వహణకార్యదర్శి, సుంకర నాగేంద్ర కిషోర్, గూడూరు రాధిక, రాజేష్ ఖన్నా, బాడిస శ్రీనివాస్, చండీప్రియ, సైకాలజీ విభాగం కోర్సు కో ఆర్డినేటర్ డాక్టర్ నారాయణ నక్కిన, అధ్యాపకులు డాక్టర్ రాజశేఖర్ పడాల, డాక్టర్ కృష్ణ భవాని పరిశోధక సైకాలజీ విద్యార్థులు పాల్గొన్నారు.

సిహెచ్‌సిలో నవజాత శిశు కేంద్రం

ప్రజాశక్తి-కడియం

కడియం సామజిక ఆరోగ్య కేంద్రం (సిహెచ్‌సి)లో నవజాత శిశువు సంరక్షణ వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని, దీనికిగాను (న్యూ బోర్న్ స్టెబిలైజెషన్ యూనిట్) సమాకురిందనిఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ ప్రజలను తెలిపారు. అన్నిరకాల వైద్య సేవలతో పాటు ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నమన్నారు. నవజాత శిశువులకు చంటిపిల్లల వైద్యులు డాక్టర్ శివశంకర్ సేవలు అందిస్తున్నారని సూపరింటెండెంట్ తెలిపారు.

సిహెచ్‌సిలో నవజాత శిశు కేంద్రం

ప్రభుత్వం అందర్నీ మోసం చేసింది

- బహిరంగ సభలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్
- ముమ్మిడివరం నియోజకవర్గంలో సాగిన యువగళం యాత్ర

ప్రజాశక్తి - ముమ్మిడివరం

వైసిపి ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని టిటిఆర్ నగర్ నుంచి బుధవారం యువగళం ప్రారంభమైంది. తొలుత నూతనంగా నిర్మించిన టిడిపి కార్యాలయాన్ని లోకేష్ ప్రారంభించారు. అనంతరం పెద్ద వంతెన వద్ద టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాట్ల సుబ్బరాజు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అవినీతి మయమైన వైసిపి ప్రభుత్వం మరో మూడు నెలల్లో మాడి మసై పోవడం ఖాయమన్నరు. ముఖ్యమంత్రి జగన్ చంద్రబాబుకి అవినీతి మరక అంటించాలని ప్రయత్నించి భంగపడ్డారన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు చివరికి న్యాయవాదుల పట్లా జగన్ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. జగన్‌కి పేదవాళ్లు మంచి ఇంట్లో ఉండటం ఇష్టం ఉండదన్నారు. అందుకే టిడిపి కట్టిన టిడ్కో ఇళ్లు ఇవ్వకుండా వేధిస్తున్నారన్నారు. ఒక పక్క బటన్‌లు నొక్కుతూ మరో పక్క పేదల బతుకులను రోడ్లపైకి లాగుతున్నాడని విమర్శించారు. రాబోయే రోజుల్లో పీల్చే గాలిపైనా పన్నులు వేస్తాడని ఎద్దేవా చేశారు. 100 సంక్షేమ కార్యక్రమాలు రద్దు చేసిన మొదటి ముఖ్యమంత్రి జగన్ అని అన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను విస్మరించి మోసం చేశాడన్నారు. అభయహస్తం డబ్బులు రూ.2,500 కోట్లు దొచేశాడన్నారు. జాబ్ క్యాలెండర్‌ను అటకెక్కించాడని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, అన్ని ఖాళీ పోస్టులు భర్తీ చేస్తామని, జిల్లా కేంద్రాల్లో స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం రైతుల్ని ఆదుకోకపోగా ఇప్పుడు మోటార్లకు మీటర్లు పెడుతున్నారన్నారు. అవి రైతులకు ఉరితాళ్లు అన్నారు. పోలీసులకు సరెండర్స్, టిఎ, డిఎలు సైతం ఇవ్వట్లేదన్నారు. ఆఖరికి జిపిఎఫ్ డబ్బులు కూడా లేపేశారన్నారు. ఎంఎల్ఎ సతీష్ కుమార్ ముమ్మిడివరాన్ని అవినీతికి అడ్డాగా మార్చేశారన్నారు. ఆయన కలెక్షన్ కుమార్‌గా మారారన్నారు. మత్స్యకారులకు ఇచ్చే నష్టపరిహారంలోనూఆయన వాటాలు వసూలు చేస్తున్నారన్నారు. మత్సకారులకు కేటాయించిన డీజిల్ దారి మళ్లించేస్తూ పెద్దఎత్తున దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. యానాం నుంచి లిక్కర్ తెచ్చి ముమ్మిడివరంలో అమ్మేస్తున్నారన్నారు. ఈ నాలుగున్నర ఏళ్లలో ఎంఎల్ఎ కలెక్షన్ కుమార్ అక్రమార్జన రూ.400 కోట్ల పైమాటేనన్నారు. ఇది వైసిపి నాయకులు, కార్యర్తలే చెబుతున్న మాట అన్నారు. ఎదుర్లంక వద్ద రూ.79 కోట్లుతో గ్రోయిన్ల నిర్మాణానికి 2019లో శంకుస్థాపన చేశారు. అది శిలాఫలకానికే పరిమితమైందన్నారు. 2022 మేలో ఐ. పోలవరం మండలానికి రక్షణ వలయంగా ఉన్న 22 కిలోమీటర్లు ఏటిగట్టు ఆధునికీకరణకు హామీ ఇచ్చి, తర్వాత పట్టించుకోలేదున్నారు. పల్లంకుర్రు-మూలపొలం వంతెన, గోగుల్లంక వంతెన, ముమ్మిడివరం-కాట్రేనికోన రహదారి నిర్మాణాలు శిలాఫలకాలకే పరిమితమయ్యాయన్నారు. రివిట్మెంట్ నిర్మాణాన్ని పూర్తిగా గాలికొదిలేశారన్నారు. టిడిపి హయాంలో అప్పటి ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు రూ.1800 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం టిడిపి ప్రభుత్వం రూ.110 కోట్లు నిధులు కేటాయించిందన్నారు. వైసిపి ప్రభుత్వం దాన్ని నిలిపేసిందన్నారు. వైసిపి ప్రభుత్వంలో దళితులపై దాడు పెరిగిపోయాయన్నారు. డాక్టర్ సుధాకర్ దగ్గర నుండి కొవ్వూరులో మహేంద్ర వరకూ జగన్ పాలనలో దళితులు సమిధలయ్యారన్నారు. అనంతరం ఆయన మహిళలు, యువత, దళితులతో సమావేశాలను నిర్వహించారు. ఆయన వెంట టిడిపి నాయకులు హరీష్‌మాథూర్, దాట్ల సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకులతో సెల్ఫీ దిగుతున్న లోకేష్

వినతులను పరిశీలిస్తున్న లోకేష్

కార్టూ'నిజం'



విగ్రహం తొలగించాలని నిరసన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వివాదాస్పద స్థలంలో ప్రతిష్టించిన విగ్రహాన్ని తొలగించాలని తాడిపర్రులో ఒక సామాజిక వర్గానికి చెందిన కొంతమంది మహిళలు నిరసనకు దిగిన సంఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని తాడిపర్రు లో ఇటీవల ఒక సామాజిక వర్గానికి చెందిన కొంతమంది మహిళలు వివాదాస్పద స్థలంలో సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని అకస్మాత్తుగా అర్ధరాత్రి ప్రతిష్టించారు. వివాదాస్పద ప్రాంతంలో ప్రతిష్టించిన విగ్రహాన్ని అధికారులు తొలగించే ప్రయత్నం చేయడంతో ప్రతిష్టించిన మహిళలు అడ్డుకున్నారు. దీంతో ఆర్‌డిఒ, ఎస్‌పి వంటి ఉన్నతాధికారులు వారికి నచ్చచెప్పి, నాటి నుండి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఆ ప్రాంతంలో పోలీసులు పికెట్ నిర్వహిస్తున్నారు. బుధవారం మరొక సామాజిక వర్గం మహిళలు పురుగు మందులు, పెట్రోల్ బాటిల్స్‌తో విగ్రహాన్ని తొలగించాల్సిందే అంటూ పంచాయతీ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనుమతితో వారు విగ్రహాన్ని ప్రతిష్టించారని, ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సర్పంచ్ పంచాయతీ తీర్మానాల పుస్తకం నుండి పంచాయతీ అనుమతులు లేనట్లు చూపించి, లిఖిత పూర్వకంగా ఎటువంటి అనుమతులు జారీ చేయలేదని తెలపడంతో తాత్కాలికంగా ఉపశమించారు. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ స్థానంలో నుండి విగ్రహాన్ని తొలగించాల్సిందేనని గ్రామ ప్రధాన రహదారిపై నిరసనకు కూర్చున్నారు. నిడదవోలు సీఐ, పోలీస్ అధికారులు ఆందోళనకు దిగిన మహిళలతో చర్చించి, విషయం కలెక్టర్ పరిశీలనలో ఉందని, కలెక్టర్ ఆదేశాల అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామనితెలిపారు. దీనితో శాంతించిన మహిళలు తాత్కాలికంగా వెనుతిరిగారు.

ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతున్న మహిళలు

రేపు సీతానగరం మండల సమావేశం

ప్రజాశక్తి - సీతానగరం

డిసెంబర్ 1న సీతానగరం మండల సర్వసభ్య సమావేశంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపిడిఒ కె.రమేష్ తెలిపారు. అభివద్ధి కార్యక్రమాలపై చర్చ, అధ్యక్షుని సూచనల మేరకు ఇతర అంశాలపై చర్చ జరగనుందన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలో ఉన్న అన్ని పంచాయతీ సర్పంచ్‌లు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపిటిసిలు తగిన ఆధారాలతో హాజరవ్వాలని కోరారు.

1న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కడియం

పలు ప్రాంతాలకు డిసెంబర్ 1న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు రాజమహేంద్రవరం రూరల్ విద్యుత్ శాఖ ఇఇ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. ఉదయం 07.00 గంటల నుంచి మధ్యాహ్నం 01: గంటల వరకూ వార్షిక విద్యుత్ మరమ్మతుల నిమిత్తం జేగురుపాడు, కడియం హెడ్ క్వార్టర్ ఫీడర్‌లకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. కడియం, జేగురుపాడు, కె.సావరం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి డిపార్ట్‌మెంట్‌కు సహకరించవలసినదిగా కోరుతున్నామన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై కార్యాచరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ పోరాట కార్యాచరణలో భాగంగా స్థానిక ఎస్‌కెవిటి ఉన్నత పాఠశాలలో బుధవార మున్సిపల్ ఉపాధ్యాయుల సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన పి.జయకర్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్స్ తక్షణం నిర్వహించాలని, మునిసిపల్ ఉన్నత పాఠశాలలలో అన్ని పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని, మున్సిపల్ టీచర్లకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, కొత్త డిడిఒల ద్వారా దరఖాస్తు చేసుకునే సౌకర్యం కల్పించాలని, పాఠశాల అన్నింటికీ బోధనేతర సిబ్బందిని నియమించాలని, భవనాల అద్దె కరెంటు బిల్లులు చెల్లించాలని, అన్ని రకాల బకాయిలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర సంఘం ఇచ్చిన కార్యాచరణ మేరకు దశల వారీ పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలియజేశారు. ఈ నెల 29న డిఇఒ, కలెక్టర్లకు నోటీసులు అందజేస్తామని, డిసెంబర్ 5న మున్సిపల్ కేంద్రాల్లో నిరసన ప్రదర్శన, 12, 13న అన్ని మున్సిపాలిటీరల్లో ప్రచారం, 15న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం జిల్లాల వారీ సదస్సులు, 30న రాష్ట్రస్థాయి ధర్నా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎన్.రవిబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నగర శాఖ అధ్యక్షులు గోపి అప్పారావు, ప్రధాన కార్యదర్శి జెవివి.సుబ్బారావు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నేత జయకర్

నేరాలు ఘోరాలు

బోల్తా పడిన ట్రాక్టర్ ట్రక్కు

ధాన్యం లోడు ట్రాక్టర్ బోల్తా

ప్రజాశక్తి-బిక్కవోలు

ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కు కెనాల్ రోడ్‌లో బుధవారం బోల్తా పడింది. పిఠాపురం నుంచి 170 ధాన్యం బస్తాలతో బిక్కవోలు శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్లుకు వెళ్తున్న ట్రాక్టర్ బిక్కవోలు దాటిన తర్వాత సీతమ్మ చెరువు వద్ద బోల్తా పడింది. కేవలం ట్రక్కు మాత్రే బోల్తా పడటంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అనపర్తి నుండి బిక్కవోలు వరకు కెనాల్ రోడ్డు మీద పెద్ద పెద్ద గుంతలు పడడం వల్ల తరచూ ఇటువంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయని,ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని వాహనదారులు కోరుచున్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జిల్లాలో పోషకాహారం లోపం గల పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పౌష్టికాహారాన్ని అందించాలని కమిషనర్ కె.దినేష్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం పోషకాహార లోపం గల పిల్లలకు పౌష్టికాహారాన్ని అందచేసేందుకు 'బంగారు కొండ' ద్వారా దత్తత తీసుకున్న పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. గోరక్షణపేటలోని షేక్ ఫారూక్ ఇంటికి వెళ్లి పౌష్టికాహార కిట్టును అందజేశారు. ఈ సందర్భముగా మాట్లాడుతూ ప్రజలు తమ పరిధిలోని పోషకాహార లోపం గల పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని కోరారు. రేపటి తరమైన పిల్లలను కాపాడుకోవడం ద్వారా మంచి భవిష్యత్తును వారికి అందచేయాలని అన్నారు. నగరపాలక సంస్థ సిబ్బంది దత్తత తీసుకొన్న 35 మంది పిల్లలను ఎప్పటికప్పుడు వారిని కలుసుకొని వారికి అందుతున్న పౌష్టికాహార వివరాలు, వారి ఆరోగ్యాన్ని పరిశీలిస్తున్నారని చెప్పారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా కిసాన్ మేళా

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

బ్యాంక్ ఆఫ్ బరోడా బుధవారం రాజమహేంద్రవరంలో కిసాన్ మేళా నిర్వహించింది. కిసాన్ పఖ్వాడా ద్వారా బ్యాంక్ రైతులతో నిమగ్నమై బ్యాంక్ నిర్వహించే వివిధ వ్యవసాయ కార్యక్రమాలతో పాటు, వ్యవసాయ ఉత్పత్తులు, పథకాలపై అవగాహన కల్పిస్తోంది. ఈ మెగా కిసాన్ మేళాను హోమ్ శాఖ మంత్రి తానేటి వనిత, బ్యాంక్ ఆఫ్ బరోడా సిజిఎం దినేష్ పంత్, జోనల్ హెడ్ రితేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దినేష్ పంత్ మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యవసాయ వినియోగదారుల నమ్మకమైన, బలమైన సుస్థిరతను కలిగి ఉందన్నారు. ఈ మెగా కిసాన్ మేళాను రాజమండ్రిలో నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా నుండి వ్యవసాయ రుణం కోసం దరఖాస్తు చేసుకోవడానికి, వినియోగదారులు https://bit.ly/AGRILoanలో సందర్శించచ్చని చెప్పారు.

వైసిపి జెండా స్థూపం ఏర్పాటుపై నిరసన

ప్రజాశక్తి-గోపాలపురం

వైసిపి జెండా స్థూపాన్ని వాలీబాల్ ఆడుకునే ప్రదేశంలో ఏర్పాటు చేయడానికి వీల్లేదని టిడిపి ఆధ్వర్యాన బిసి నాయకులు, వైసిపి నాయకులు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. బుధవారం ఆంధ్రకు జగన్ ఎందుకు కావాలనే కార్యక్రమంలో భాగంగా గోపాలపురం సచివాలయం-3లో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సచివాలయంలో సంక్షేమ పథకాల గురించి ఆవిష్కరణ జరిగిన తర్వాత జెండా స్థూపం ఏర్పాటు చేసే సమయంలో టిడిపి నాయకుల జెండా ఎగురవేయడానికి వీల్లేదని అడ్డగించారు. దీంతో ఎఎస్ఐ శోభనాద్రి, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను సముదాయించారు. ఎస్ఐ కె.సతీష్ కుమార్ వచ్చి వారితో మాట్లాడారు. టిడిపి నాయకులు ఫిర్యాదు ఇవ్వాలని సూచించారు. అనంతరం వైసిపి నాయకులు పైడి శిరీష జెండా ఆవిష్కరించారు.

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాస్

అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

ప్రజాశక్తి-పెరవలి

ఖండవల్లిలో లంకమాలపల్లిలో బుధవారం ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రామంలో రూ.43.60 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.80 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.25.80 లక్షల వ్యయంతో నిర్మించిన వైయస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ఆయన ప్రారంభించారు. రూ.20 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు అనంతరం గ్రామంలో 390 మంది రైతులకు సి.క్లాస్ గోదావరి లంక భూమి పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా పలు ప్రభుత్వ పథకాలు నేరుగా వారి అకౌంట్లకు జమ చేసే విధంగా తగు చర్య తీసుకుందన్నారు. గ్రామాల్లో రైతు భరోసా హెల్త్ క్లినిక్ నూతన సచివాలయం భవనాలు స్వచ్ఛమైన తాగునీరు నాడు- నేడు పథకంలో పాఠశాలలు ఆధునీకరణకు చర్యలు తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పులిదిండి నాగరాజు సొసైటీ అధ్యక్షులు కుసుమే సూరిబాబు, ఎంపిపి కె.సీతారాం ప్రసాద్, వైసిపి మండల అధ్యక్షులు వీరమల్లు సత్యనారాయణ, ఎంపిడిఒ సింగంశెట్టి రమేష్, వ్యవసాయ అధికారి మేరీ కిరణ్, డాక్టర్ అనపర్తి కృష్ణవేణి, వైస్ ఎంపీపీ వెంద్ర శ్రీనివాస్, పొట్టి రాంబాబు, ఎంపిటిసిలు బొకే వెంకటేశ్వర్లు, పల్లేటి రవి, బీర సత్యవేణి రాజు, గారపాటి నాగభూషణం, అరిగెల వేణుగోపాలరావు పాల్గొన్నారు.

యానాం వార్తలు

పలువురికి అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో వివిధ శాఖల్లో యుడిసిలుగా పని చేస్తున్న పలువురు ఉద్యోగులకు అసిస్టెంట్లగా ఉద్యోగోన్నతి లభించింది. పుదుచ్చేరి వ్యాప్తంగా పలువురికి ప్రమోషన్లు కల్పించగా వారిలో యానానికి సంబంధించి ఆరుగురు ఉన్నారు. త్వరలో వీరికి సంబంధిత శాఖలు కేటాయించనున్నారు.

ఘనంగా పిరమిడ్ 3వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - యానాం

స్థానిక యానాం బీచ్ రోడ్‌లోని రామకష్ణ పరమహంస పిరమిడ్ మూడోవ వార్షికోత్సవాన్ని అన్యం రామకష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఆర్థిక సాయం అందిస్తున్న బాబూరావు

వైఎస్ఆర్ బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి-తాళ్లపూడి

ఆర్థిక అవసరాలు ఉన్న కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందని వైసిపి ఎస్సి సెల్ కొవ్వూరు నియోజకవర్గ అధ్యక్షుడు యాళ్ల బాబూరావు అన్నారు. మండలంలోని ప్రక్కిలంకలో ఇటీవల మరణించిన నంద్యాల అరుణకుమార్ కుటుంబానికి వైయస్సార్ బీమా పథకంలో భాగంగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.పది వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం బాబురావు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కవిత వాలంటీర్లు రాధిక, సూర్యకళ ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు నాగశైలజ

ప్రజాశక్తి-చాగల్లు

రాష్ట్ర స్థాయి అండర్ 17 బాలికల క్రికెట్ పోటీలకు చాగల్లు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన కె.నాగశైలజ ఎంపికైనట్టు హెచ్ఎం పి.వీర్రాజు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన నాగశైలజను, శిక్షణ నిచ్చిన పీడీ విజయలక్ష్మిని, పిఇటి ముని ప్రేమ్ చంద్‌ను విద్యాకమిటీ చైర్మన్ భగవాన్, ఇన్‌ఛార్జి హెచ్ఎం మోజెస్ అభినందించారు.

చందన ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యాన్నదానం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

వైసిపి రాజమండ్రి రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆధ్వర్యంలో 2022లో ప్రారంభించిన నిత్యాన్నదానం కొనసాగుతోంది. రూరల్ నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో అన్నదానం చేశారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమంలో వచ్చే ప్రజలకు భోజనం ఏర్పాటు చేశారు. బుధవారం బొమ్మూరు దోసాలమ్మ గుడి సెంటర్లో 150 మందికి అన్నదానం చేశారు. మిగిలిన రోజులలో రూరల్ నియోజకవర్గం వివిధ ప్రాంతాలలో ఈ అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మూరు వైసిపి కన్వీనర్లు యనుముల త్యాగరాజు, మత్సేటి శివ, మేడపాటి సద్గుణ రామారెడ్డి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, స్కూల్ కమిటీ చైర్మన్ కాకులపాటి కుమార్, సమీర పాల్గొన్నారు.

వెంకన్న హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని అన్నవరప్పాడులో వెంకటేశ్వర స్వామి ఆలయంలో హుండీలు లెక్కింపు బుధవారం దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఇఒ ఎం.రామయ్య పర్యవేక్షణలో నిర్వహించారు. గ్రామస్తులు, యాత్రికులు, శ్రీవారి సేవకులు సమక్షంలో లెక్కించారు. 34 రోజులకు రూ.2,92,870 ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి ఎం.రాధాకృష్ణ పాల్గొన్నారు.

పిడిఎస్ సరుకుల పంపిణీపై సమీక్ష

ప్రజాశక్తి - చాగల్లు

మండలమునకు సంబంధించి పిడిఎస్ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశం బుధవారం మండల కార్యాలయంలో తహశీల్దారు కె.రాజ్యలక్ష్మి, ఎంపిపి మట్టా వీరాస్వామి ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రతి నెలా ఎండియు ఆపరేటర్స్ ద్వారా డోర్ టు డోర్ నిత్యావసర సరుకులు పంపిణీ విషయమై ముందుగా వాలంటీర్ల ద్వారా కార్డుదారులకు తెలియపరుస్తారు. పండుగ రోజుల్లో కార్డుదారులకు పప్పులు, నూనెలు సరఫరా చేయుడ, ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు ఉన్నా మండల అధికారులకు, విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీకి తెలియపరచవచ్చునని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ బి.రామ్‌ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది, మండలంలోని రేషన్ షాపు డీలర్లు సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ లజపతిరాయ్

వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలి

ప్రజాశక్తి-కడియం

ఉత్తమ వత్తిగా భావించే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారు నిరంతరం తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎంఇఒ వి.లజపతిరాయ్ పిలుపునిచ్చారు. కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిని సార్ధకం చేసుకోవాలని, విద్యాలయాన్నే దేవాలయంగా భావించాలని ఉద్బోధించారు. ఈ సమావేశంలో కోర్సు రిసోర్స్ పర్సన్ సుదర్శన్, పాఠశాల హెచ్ఎం టి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి తిరుగులేదు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రజా సంక్షేమ పాలనకు తిరుగులేదని, ఎవరు ఎన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకున్న మళ్లీ అధికారంలోకి వచ్చేది వైసిపియేనని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. బుధవారం కోరుకొండ మండలం కాపవరంలో తురిగడ్డ రివర్స్ పంపింగ్ స్కీమ్ అభివద్ధి పనులకు, చిన్న నీటి పారుదల అభివద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. 1,510 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉంఉలఖు జక్కంపూడి రాజాతో కలిసి మంత్రి అంబటి రాంబాబు మాట్లాడారు. తురిగడ్డ ఎత్తిపోతల పథకం మిగతా ఎత్తిపోతల పథకం కంటే చాలా భిన్నంగా ఉంటుందన్నారు. ఇక్కడ వరద నీటిని ఎత్తిపోతల పథకం నుంచి గోదావరిలోకి పంపింగ్ చేస్తారన్నారు. ఎన్నో దశాబ్దాల నుండి రైతులు పడుతున్న కష్టాలను చూసిన స్థానిక ఎంఎల్ఎ జక్కంపూడి రాజా పలుమార్లు సిఎం జగన్మోహన్ దృష్టికి ఈ ప్రాంత ప్రజలు, రైతాంగం ఎదుర్కొంటున్న కష్టాలను తీసుకువెళ్లి వాటిని పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకున్నారన్నారు. నియోజకవర్గంలోని రైతాంగానికి ఊరట కలిగించే విధంగా రూ.38 కోట్లతో చిన్న నీటి పారుదల అభివద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ఎవరు ఎంత మంది కలిసి వచ్చినా అంతిమ విజయం వైసిపిదేనని, మళ్లీ వైఎస్.జగన్ సిఎం అవుతారని చెప్పారు. అనంతరం జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మేడా గురుదత్త ప్రసాద్, జక్కంపూడి గణేష్ పాల్గొన్నారు.

మంత్రి అంబటికి జ్ఞాపికను అందిస్తున్న ఎంఎల్ఎ రాజా తదితరులు

ఆడుదాం ఆంధ్ర కిట్ల పంపిణీ

చాగల్లు : క్రీడల ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలి పొందవచ్చని ఎంపిపి మాట్టా వీరాస్వామి అన్నారు. నేలటూరు యుపి స్కూల్లో బుధవారం ఆడుదాం ఆంధ్ర క్రీడా సామాగ్రిని ఆయన పంపిణీ చేశారు. ఈ సదర్భంగా తహశీల్దారు కె.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామని తెలిపారు. చాగల్లు సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా నైపుణ్యాన్ని ప్రోత్సహించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలో తొలిసారిగా ఈ క్రీడా కార్యక్రమాన్ని ప్రోత్సహించడం అభినయమన్నారు. ఎంఇఒ వి.ఖాదర్ బాబు, పిఇటి విజయ్‌కుమారి, వైసిపి నాయకులు బండి అశోక్ బాబు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీల ప్రతినిధులతో డిఆర్ఒ భేటీ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

నవంబర్ 22 నుంచి 29 వరకూ కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల తొలగింపు, చేర్పులు, మార్పులకు చెందిన నియోజకవర్గాల వారీగా జిల్లాలో కొనసాగుతున్న ప్రక్రియపై రాజకీయ పార్టీలతో జరిగిన సమావేశంలో చేర్చించినట్టు డిఆర్ఒ జి.నరసింహులు పేర్కొన్నారు. బుధవారం ఆయన తన ఛాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఎస్ఆర్ 2024పై, ఓటరు నమోదుపై చర్చించారు. ఈ సందర్భంగా జి.నరసింహులు మాట్లాడుతూ, జిల్లాలో ఓటు హక్కు లేని ప్రతి ఒక్కరినీ గుర్తించి ఓటు నమోదు చేసేందుకు అవసరమైన ప్రచార కార్యక్రమాల్లో రాజకీయ పార్టీలు తప్పనిసరిగా భాగస్వామ్యం చెయ్యాలని కోరారు. ఓటరు కార్డులో సవరణల కోసం దాఖలైన దరఖాస్తుల వివరాలు, ఆయా దరఖాస్తులపై తీసుకున్న చర్యలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమగ్రంగా వివరాలు అందించినట్లు తెలిపారు. ఇప్పటికే జంక్ అక్షరాలు వివరాలు ఉన్న, ఒకే డోర్ నంబర్‌లో 10 మంది పైబడి ఉన్న ఓటర్ల జాబితా క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసినట్లు తెలిపారు. డిసెంబర్ 2, 3 తేదీల్లో రెండు రోజుల పాటు జిల్లాలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల సెక్షన్ ఆర్ఐ గిరీష్, రాజకీయ పార్టీల ప్రతినిధులు కె.రాజశేఖర్ (వైసిపి) ఎస్ఎస్.మూర్తి (సిపిఎం) బి.రామచంద్రరావు (బిజెపి) ఎన్.రమేష్ (కాంగ్రెస్) పాల్గొన్నారు.

సహకార బ్యాంక్ రుణాలపై అవగాహన

ప్రజాశక్తి- గోకవరం

రంపఎర్రంపాలెంలో గోకవరం కో-ఆపరేటివ్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ బ్యాంకు ద్వారా 3 రకాల రుణాలు ఇస్తున్నామని తెలిపారు. కెసిసి ద్వారా రుణాలు తీసుకుని ఒక సంవత్సరం లోపు చెల్లించినట్లయితే వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. దీర్ఘకాలిక రుణాలులో రైతు నేస్తం ఒక ఎకరానికి రూ.8 లక్షలు రుణాలు ఇస్తుందని, నూటికి రూపాయి వడ్డీ ఉంటుందని, వడ్డీ రాయితీ కూడా ఇస్తుందని తెలిపారు. కాల పరిమితి 10 ఏళ్లు ఉంటుందన్నారు. డ్వాక్రా రుణాలు, గోల్డ్ లోన్లు కూడా ఇస్తున్నట్టు తెలిపారు. ఈ బ్యాంకు ద్వారా జీరో అకౌంట్ చేసిన వారికి ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద మొదటి సంవత్సరం బీమా సొమ్మును బ్యాంకు వారు చెల్లిస్తారన్నారు. 70 ఏళ్ల లోపు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ బీమాను సద్వినియోగం చేసుకుని రూ.రెండు వరకు రుణాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు, బ్యాంక్ సూపర్‌వైజర్ కె.ప్రదీప్ చంద్ర, స్టాఫ్ అసిస్టెంట్ బి.శ్వేత, సొసైటీ సిబ్బంది శ్రీనివాస్, అప్పన్న బాబు, సొసైటీ డైరెక్టర్ తోట సత్యనారాయణ, డి.వెంకటరత్నం, శివ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్

రమాదేవి కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి -దేవరపల్లి

రమాదేవి కుటుంబానికి న్యాయం చేయకపోతే ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కొండేటి అన్నామణి హెచ్చరించారు. రమాదేవి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఆశ వర్కర్స్ చేపట్టిన సమ్మె బుధవారం తొమ్మిదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మె శిబిరంలో అన్నామణి మాట్లాడుతూ తొమ్మిది రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గం అన్నారు. గ్రామ కమిటీల ఆమోదం లేకుండా వేరే పంచాయతీ నుంచి ఆశా వర్కర్‌గా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. అధికారులపై రాజకీయ నాయకుల పెత్తనం ఏమిటన్నారు. సిఐటియు మండల కార్యదర్శి ఎస్.భగత్ మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం అంటున్న ప్రజాప్రతినిధులు సమస్య ఎందుకు పరిష్కరించట్లేదన్నారు. కె.పోచమ్మ, సిఐటియు నాయకులు కె.రత్నాజీ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు మల్లిపూడి వెంకటలక్ష్మి, డి.హైమావతి, కె.అచ్చమ్మ, వెంకటలక్ష్మి, కాకర్ల నాగమణి, మామిడిపల్లి వీరలక్ష్మి, కుమారి, టేకు సత్యవతి, కందుకూరు నాగమణి, కొక్కురుపాటి కుమారి, వనం వెంకటలక్ష్మి, పిప్పళ్ల ఇందు, మెరుపు విజయ పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాల ప్రోత్సాహానికి చర్యలు

ప్రజాశక్తి -గోకవరం

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల నైపుణ్యాన్ని ప్రోత్సహిస్తున్నట్టు మండల సచివాలయల కన్వీనర్ దాసరి రమేష్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కె.పద్మజ్యోతి ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రకు క్రీడా ఉత్సవాలను వైసిపి సీనియర్ నాయకులు సుంకర వీరబాబు, దాసరి రమేష్, ఎస్సి సెల్ కార్యదర్శి వరసాల ప్రసాద్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వచ్చే నెల 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు గ్రామస్థాయిలో, 21 నుండి జనవరి 4 వరకు మండల స్థాయిలో జనవరి 5 నుండి రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీలకు 15 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు యువతీ పాల్గొనవచ్చని తెలిపారు. వైసిపి నాయకులు కర్రి సూరారెడ్డి, మెహర్‌బాబా, చింతల అనిల్ కుమార్, చిన్న, చంద్రం, ఇఒపిఆర్‌డి ఎం.రాజేశ్వరరావు, పిఆర్ జెఇ అబ్బాయి దొర తదితరులు పాల్గొన్నారు.

బోర్డును ప్రారంభిస్తున్న వైసిపి నాయకులు

NOTICE
IN THE COURT OF THE HON'BLE 2ND ADDL. SENIOR CIVIL JUDGE :: GUNTUR
E.P.No.272/2018 in O.S.No.443/2013
Between:
Damarla Vasantha Rao ...D.H.R.
AND
Komarapuri Gangachalam & Others ...J.D.R.'s
To,
J.D.R. No-1: Komarapuri Ganga Chalam, S/o. Appala Swamy, Special Grade Deputy Collector (Retired), Presently Working as Competent Authority Reliance Gas Transportation Ltd, Reliance Industries Ltd. Gadmoga R/o. Door No.8-13-8/2/1, Pratap Nagar, Kakinada, East Godavari Dt.
పై నెంబరు E.P.లో **1వ జె.డి.ఆర్.** అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా SALE నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Subsituted Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా సదరు ఆర్డరు ప్రకారము మీరు **ది.11-12-2023 ఉ.గం. 10.30 ని.లకు** పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కానీ, మీ అడ్వకేట్ ద్వారా గాని, హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచు కొనవలయును. లేని ఎడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
వాయిదా తేదీ: 11-12-2023
జి.వి.రమణ, డి.హెచ్.ఆర్. తరఫు
అడ్వకేట్, గుంటూరు. సెల్: 9848231931

వైసిపి ప్రభుత్వంలో అర్హులకందని పథకాలు

ప్రజాశక్తి - సీతానగరం

వైసిపి ప్రభుత్వంలో అర్హులకు పథకాలు అందడం లేదని టిడిపి సీనియర్ నాయకుడు సూరెడ్డి నరేంద్ర ఆరోపించారు. తన నివాసంలో బుధవారం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. అభివద్ధి అంటే సంపదను సృష్టించి తద్వారా ప్రజలకు సంక్షేమ అందించడం అన్నారు. కోరుకొండ మండలం ఆవ భూముల్లో, రాజానగరం నియోజకవర్గంలో పలచోట్ల ముంపు ప్రాంతాల్లో అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో నేటికీ ఉపయోగంలోలేని పరిస్థితులు నెలకొన్నాయని సూచించారు. అధికార పార్టీ వల్ల వేలాదిమందికి రాజానగరం నియోజకవర్గంలో ఎటువంటి ప్రయోజనం చేకూరాలేదని అన్నారు. కాతేరు నుంచి సీతానగరం వరకు గల నాలుగు లైన్ల రహదారి నేటికీ పూర్తికాలేదన్నారు. నాలుదేళ్ల నుంచి అంతంత మాత్రంగానే రోడ్డు పనులు ఉన్నాయని, నాణ్యత లేని నిర్మాణాలు చేపట్టడంతో నిత్యం అనేక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రాత్రిపూట సమయంలో అనేక మంది యువత పలు ప్రమాదాలకు గురై ప్రాణాలను కోల్పోయే సందర్భాలు ఎదురవుతున్నాయన్నారు. టిడిపి హయాంలో ప్రజలకు ఉచితంగా ఇసుక లభించింది. ఇప్పుడు ప్రజలు మరియు భవన నిర్మాణ కార్మికులకు నేటికీ ఇసుక వలన ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నాయని అన్నారు.

సామర్లకోట పురపాలక సంఘం
ఆర్.ఒ.సి. నెం. 562/2023-ఇ1 తేది.29-11-2023
షార్టు టెండరు నోటీసు
సామర్లకోట పురపాలక సంఘం పట్టణము నందు రూ. 1,00,000/-లు పైబడి జరుగు అభివృద్ధి పనులకు థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ ఏజన్సీ వారు పనుల నాణ్యతను పర్యవేక్షణ చేసి సర్టిఫికెట్ ఇచ్చుటకు షార్టు టెండర్లు కోరబడుచున్నవి.
1. టెండరు షెడ్యూలు కొరకు రుసుము చెల్లించుటకు ఆఖరు తేది : 04-12-2023
2. టెండరు ఇ.ఎమ్.డి. చెల్లించుటకు ఆఖరు తేది : 05-12-2023
3. టెండరు షెడ్యూలు జారీ చేయు తేది : 06-12-2023 (మధ్యాహ్నం గం॥ 12.00లకు)
4. టెండరు తెరువబడు తేది : 06-12-2023 (సాయంత్రం గం॥ 4.30లకు)
తదుపరి వివరముల కొరకు పురపాలక సంఘ కార్యాలయము నందు సమాచారం పొందవచ్చును.
సం/- **కమిషనరు,** సామర్లకోట పురపాలక సంఘం

సూచనలు పాటిస్తే అధిక దిగుబడి

ప్రజాశక్తి-తాళ్లపూడి

రైతులు సాగు సమయంలో అధికారుల సూచనలు పాటిస్తూ ముందు జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించి లాభాలు పొందవచ్చని రెవెనూయ కార్యాలయ గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు రైతులకు సూచించారు. మండలంలోని ప్రక్కిలంక పంచాయతీ పరిధిలో గల పైడిమెట్ట గ్రామానికి చెందిన గంధం గంగాధర్, చాదరాసి రాజుకు సంబంధించిన పంట పొలాల్లో బుధవారం వరి పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఎకరానికి సగటు దిగుబడి 38 బస్తాలు వచ్చినట్లు గుర్తించారు. పంట కోత ప్రయోగ సమయంలో ఎఎస్ఒతో పాటు రైతులు వ్యవసాయ సహాయకులు శ్యామ్ ప్రసాద్, సుధీర్ బాబు, ఇన్సూరెన్స్ ప్రతినిధి పోసిబాబు ఉన్నారు.

గౌరీపట్నంలో 'బాబు ష్యూరిటీ..'

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలంలోని గౌరీపట్నం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ అనే కార్యక్రమంలో భాగంగా టిడిపి, జనసేన పార్టీల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టిడిపి, జనసేన నాయకులు మద్దిపాటి వెంకటరాజు, దొడ్డిగర్ల సువర్ణ రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో రాయలసీమ ఫ్యాక్షనిస్టు తరహాలో గోదావరి జిల్లాల్లో తుపాకీతో హత్యలు చేసే సంస్కృతి వచ్చిందన్నారు. 2024 ఎన్నికల్లో వైసిపిని ఓడించాలని, టిడిపి, జనసేన ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడబోతోందని చెప్పారు. రాష్ట్రంలోని స్థితిగతులను ప్రజలకు వివరించడానికి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఆంద్రు అనిల్, నాయకులు గన్నమని హరికృష్ణ, కొటారు ద్రవకాంత్, దాపర్తి వీరకృష్ణ, పాతూరి గిరిధర్ పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని అజ్జరం గ్రామానికి చెందిన జల్లు శ్రీరామ్మూర్తికి మోకాలి ఆపరేషన్ వైద్యం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.60 వేల చెక్కును బుధవారం ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు అందజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గార్లపాటి నాగ సుధా భూషణం, వైసిపి నాయకులు భూషణం, వాసురెడ్డి భాస్కర్ రెడ్డి, సత్యనారాయ పాల్గొన్నారు

ఒరిజినల్ దస్తావేజు పడిపోయినది
డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాట్రేనికోన మండలం, పల్లంకుర్రు గ్రామ శివారు పోర కాపురస్తులు రేకాడి పెదకాసులయ్య గారి కుమారుడు నరసింహారావుకు చెందిన కందికుప్ప గ్రామం తాలూకు జిరాయితీ మెరక రి.స. నెం. 12రు, రి.స. నెం. 13రులలో య. 0.15 1/4ట్లు భూమికి సంబంధించిన లింకు దస్తావేజు నెం. 527/2017రు గల ఒరిజినల్ దస్తావేజులు తీసుకొని ది. 20-11-2023 సం॥రం తేదీన కందికుప్ప గ్రామం నుంచి కాకినాడ వెళుతున్న సమయంలో మార్గం మధ్యలో పడిపోయినవి. దొరికినవారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.
రేకాడి నరసింహారావు
తండ్రి: రేకాడి పెద కాసులయ్య
పోర గ్రామం, పల్లంకుర్రు
కాట్రేనికోన మండలం
సెల్: 9640281264

అమలాపురం గౌరవ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. నెం. 61/2022
బిట్వీన్:
మండిగ విజయలక్ష్మి -వాది
అండ్
చీకురుమిల్లి రాజ్యం మరియు వగైరా -ప్రతివాదులు
టు:
D-1: చీకురుమిల్లి రాజ్యం, భర్త: భూషణం, C/o. చీకురుమిల్లి వారి పేట, కాట్రేనికోన మండలం, పల్లంకుర్రు, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.
పైన చెప్పిన దావాలో 1వ ప్రతివాదికి శ్రీ కోర్టు వారు ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినను తీసుకొనక త్రిప్పివేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం తెలియ చేయునది ఏమనగా, **ది. 15-12-2023వ తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయ్యి తగు ఆక్షేపనలు తెలియచేయవలెను. లేనిచో పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.
చిల్లా నరసింహ గిరి
భూసారపు బ్రహ్మ యేసుబాబు
వాది తరుపు న్యాయవాదులు
అమలాపురం, సెల్: 9966956692

ప్రకటన
నా క్లయింట్ దొమ్మేటి నాగేశ్వరరావు, S/o. లంకయ్య అనే తాతయ్య ముమ్మిడివరం గ్రామము, ముమ్మిడివరం మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వారి సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా,
నా క్లయింట్ కట్టా పళ్ళాళ్ళమ్మ గారి నుంచి ఈ దిగువ షెడ్యూలు ఆస్తి ది. 01-02-2022వ తేదీన దస్తావేజు నెంబర్ 474/2022 రీత్యా కొనుగోలు చేసినారు. సదరు ఆస్తిపై ఎవరికైనా ఏమైనా అభ్యంతరములు గాని, క్లెయిములు గాని, హక్కులు గాని ఉన్న యెడల ఈక్రింది ఉదహరించిన లాయరు గారికి డాక్యుమెంట్లు ప్రూఫ్‌తో సహా ఈ ప్రకటన వెలువడిన 7 దినములలో అభ్యంతరములు లిఖితపూర్వకముగా అందజేయవలెను. లేని యెడల ఈ షెడ్యూలు ఆస్తిపై ఏవిధమయిన క్లెయిములు, అభ్యంతరములు లేవని తదుపరి చర్యలు తీసుకొనబడును.
షెడ్యూలు ఆస్తి వివరం: డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, (పూర్వపు తూర్పుగోదావరి జిల్లా), ముమ్మిడివరం రిజిష్టరీ, ముమ్మిడివరం మండలం, ముమ్మిడివరం గ్రామం నగర పంచాయతీ సర్వే నెంబర్ 1092-7లో విస్తీర్ణం 133.1 చదరపు గజములలో సమీప డోర్ నెంబర్ 12-48/ఎ లో స్థలం హద్దులు.
తూర్పు: కట్టా గన్నయ్య గారి వాటా స్థలము.
దక్షిణం: కాకి లక్ష్మయ్య గారి స్థలము.
పడమర: సిమెంటు రోడ్డు.
ఉత్తరం: ఉమ్మడి దారి మార్గము, మార్గము అవతల కట్టా గౌరమ్మ గారి స్థలము.
టి.శాంతి కమల
అడ్వకేట్, అమలాపురం
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్: 7013665313